


epaper. aksharakalam. com

# అక్షరకలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక

TELANGANA RISING
CURE - PURE - RARE

సంపుటి : 19 సంచిక : 86 | 11-06-2026 గురువారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00

# నాలుగో నగర కల సాకార దిశగా మరో అడుగు..

## ఎఫ్‌సీడీఏ భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్‌కు అనుసంధానంగా మరో భవ్య నగరం నిర్మించాలన్న సంకల్పానికి మరో అడుగు పడింది. భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో నిర్మించతలపెట్టిన ఈ నాలుగో నగరానికి అవసరమైన పరిపాలనా భవన నిర్మాణం పూర్తయింది. మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. దాదాపు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో, 16 వేల చదరపు అడుగులకు పైగా నిర్మాణ విస్తీర్ణంతో ఎఫ్‌సీడీఏ కార్యాలయ భవనాన్ని నిర్మించారు.

వార్త 2లో

## సుపరిపాలన అతిపెద్ద పరీక్ష

### ఎక్స్ వేదికగా మోడీ పోస్ట్



**న్యూఢిల్లీ,**

ప్రధాని నరేంద్ర మోదీ చరిత్ర సృష్టించారు. భారత్‌లో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా ఆయన నిలిచారు. ఈసందర్భంగా తన 12 ఏళ్ల పాలనపై మోదీ ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టారు. 'ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య దీక్షతో అవిశ్రాంతంగా పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలడు' అని మోదీ రాసుకొచ్చారు. ఇక, ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు.



## దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత

తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది.

2



## ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకుని కుట్ర

మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓ ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కావాలనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ చేశారని విమర్శించారు. బీఎన్ఎస్ యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదన్నారు.

2



## ప్రధానిగా 12 ఏళ్ల పదవీ కాలం పూర్తి

### మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం-జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు.

2

## ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే



2

రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం

గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల

సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం

రాష్ట్ర డిజిపి సివి ఆనంద్

## ఎన్‌డిఎ భేటీలో ప్రధాని మోడీకి అభినందనలు

### వివిధ రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీలు హాజరు

**న్యూఢిల్లీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎన్డీయే నేతల పెద్దఎత్తున అభినందలు తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకోవడం, సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డును మోదీ సొంత చేసుకున్న నేపథ్యంలో ఎన్డీయే నేతల సమావేశం బుధవారంనాడిక్కడ భారత్ మండపంలో జరిగింది. ప్రధాన మంత్రి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 22 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమ ంత్రులు, ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాల నేతలు, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1964 మే 27న తుదిశ్వాస విడిచేంత వరకూ 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. ఆ రికార్డును మోదీ అధిగమించారు.



## స్థిరాస్థి వ్యాపారి అరుణ్ కుమార్ దురాగతం

### భార్యపై అనుమానంతో కాల్పులు

### అక్కడికక్కడే మృతి చెందిన ఇల్లాలు

**హైదరాబాద్,**

ఓ స్థిరాస్తి వ్యాపారి అనుమానంతో భార్యను తుపాకీతో కాల్చి చంపాడు. ఈ ఘటన హైదరాబాద్ మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న అరుణ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మాట్లాడుకుందామని చెప్పి మరో వ్యక్తితో కలిసి తెల్లవారుజామున ఇంటికి వచ్చిన అరుణ్.. భార్య నిషారాణిపై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కాల్పుల శబ్దం విన్న స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యకు విడాకులిచ్చిన అరుణ్ కుమార్.. ఆమె సోదరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. 3 నెలల క్రితం అంబర్‌పేటలో వాహన తనిఖీలు చేస్తుండగా.. అరుణ్‌కుమార్ తుపాకీతో పోలీసులకు చిక్కాడు. తుపాకీ సీజ్ చేయడంతో పాతబస్తీకి చెందిన స్నేహితుల ద్వారా మరో తుపాకీ కొనుగోలు చేసి దారుణానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు.

## అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

### నెహ్రూ రికార్డును తిరగరాసిని మోడీ

**న్యూఢిల్లీ,**

నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు.



2

## చారిత్రక మైలురాయిని అధిగమించిన మోడీ

భారతీయుల ఆకాంక్షలకు ప్రతీక మోడీ

ఎక్స్ వేదికగా రామచందర్‌రావు అభినందనలు



2

## ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

అత్యధిక కాలం ప్రధానిగా నెహ్రూ రికార్డు బ్రేక్

మీనాక్షి వ్యవహారం ఎన్నికల సంఘం పరిధిలోనిదన్న బండి

# దర్శక దిగ్గజం భారతీరాజ కన్నుమూత

### తమిళ చిత్రపరిశ్రమ దిగ్భ్రాంతి

**చెన్నై, అక్షరకలం ప్రతినిధి**

తమిళ చలనచిత్ర చరిత్రలో గ్రామీణ కథలకు సరికొత్త దిశను చూపి, వెండితెరపై పల్లెటూరి అందాలను అత్యంత అద్భుతంగా ఆవిష్కరించిన సినీ దిగ్గజం, 'దర్శక ఇమయం' భారతీరాజా కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే అద్భుత చిత్రాలను అందించి, ప్రేక్షకులను అలరించిన ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటును మిగిల్చింది. 1941 జూలై 17న తమిళనాడులోని తేని జిల్లా అల్లినగరంలో జన్మించిన భారతీరాజా, 1977లో విడుదలైన 16 వయతినిలే' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి అప్పట్లోనే పెద్ద సంచలనం సృష్టించారు. అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను అవుట్‌డోర్‌కు తీసుకొచ్చి, తమిళ సినిమాల్లో గ్రామీణ జీవన విధానాన్ని , అక్కడి సహజత్వాన్ని కళ్లకు కట్టినట్లు చూపించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఆయనను అభిమానులు, పరిశ్రమ వర్గాలు ఎంతో గౌరవంగా 'దర్శక ఇమయం' అని పిలుచుకుంటారు. ఆయన కెరీర్‌లో సిగప్పు రోజక్కల్, కిజక్కే పోగుం రైల్, అలైగల్ ఓయ్వతి÷–లలై, ముదల్ మరియాదై, కరుత్తమ్మ వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలను తెరకెక్కించారు. ఆయన మృతికి సినీ, రాజకీయ పరిశ్రమకు చెందిన పలువురు సంతాపం తెలిపారు. సిఎం విజయ్ నివాళి అర్పించారు.

# ప్రైవేట్ కేసును అడ్డంపెట్టుకుని కుట్ర

### మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై చామల

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఓ ప్రైవేట్ కేసును అడ్డం పెట్టుకొని కావాలనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ రిజెక్ట్ చేశారని విమర్శించారు. బీఎన్ఎస్ యాక్ట్ 230 ప్రకారం ఫామ్ 26 సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. బీజేపీ.. ఎన్నికలను వాళ్ల ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఈసీని అడ్డం పెట్టుకొని బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందన్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి రెండు రాజ్యసభ సీట్లకు అవకాశం ఉందని.. కాంగ్రెస్‌కు ఒక రాజ్యసభ వచ్చే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. మూడో అభ్యర్థిని బీజేపీ ఎందుకు పోటీలో నిలబెడుతోందని ప్రశ్నించారు. ముందు నుంచే మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను తప్పించాలని బీజేపీ చూసిందని వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న కుటిల రాజకీయం గురించి దేశ ప్రజలకు తెలియాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటే అని విమర్శించారు. రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. చిల్లర రాజకీయాలు చేస్తే ఎప్పటికీ అధికారంలోకి రారని చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రధానిగా 12 ఏళ్ల పదవీకాలం పూర్తి

### మోడీకి అభినందనలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీకి అభినందనలు తెలిపారు. మోదీ నాయకత్వంపై దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన నమ్మకానికి ఈ మైలురాయి నిదర్శనమని కొనియాడారు. ఆయన పాలనలో దేశం అన్నిరంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన విస్తృతమైన సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా అభివృద్ధి ప్రయోజనాలు సమానంగా అందించేలా చేశాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పీఎం–జన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ లకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆదివాసీల కోసం ఏర్పాటుచేసిన పథకాలు ఇవని తెలిపారు. మోదీ స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారతదేశపు బలమైన ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ఆశను.. నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి కొనియాడారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని దేశాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తారని విశ్వాసం వ్యక్తంచేశారు.

# చారిత్రక మైలురాయిని అధిగమించిన మోడీ

### భారతీయుల ఆకాంక్షలకు ప్రతీక మోడీ

### ఎక్స్ వేదికగా రామచందర్‌రావు అభినందనలు

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

: ఎన్నికైన ప్రధాన మంత్రిగా అత్యధిక కాలం సేవలందించిన నరేంద్ర మోదీ ఒక చరిత్రాత్మక మైలురాయి అధిగమించారని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆయన 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలకు ప్రతీక అని పేర్కొన్నారు. 4,399 రోజులు.. భారతీయ చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిన చరిత్రాత్మక రోజులని చెప్పారు. గరీబ్ కల్యాణ్ నుంచి మహిళా సాధికారత వరకు.. రైతుల గౌరవం నుంచి యువతకు అవకాశాల సృష్టి వరకు.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల నుంచి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు.. ఆర్థిక వ్యవస్థ ఫార్మలైజేషన్ నుంచి ప్రపంచ వేదికపై దేశ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం వరకు.. ప్రతి రంగంలోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, బలమైన జాతీయ భద్రతా విధానం, నక్సలిజం క్షీణత, ఈశాన్య భారతంలో శాంతి, అభివృద్ధి, బలమైన సరిహద్దులు, విస్తృతమైన సామాజిక భద్రతా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ వేగవంతమైన ఆధునికీకరణ, భారత స్టార్టప్ సంస్కృతి ఎదుగుదల.. ఇవన్నీ జాతీయ పునరుజ్జీవనానికి కొత్త యుగాన్ని సూచిస్తున్నాయని ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ప్రధాని మోడీ సరికొత్త రికార్డు

### అత్యధిక కాలం ప్రధానిగా నెహ్రూ రికార్డు బ్రేక్

### మీనాక్షి వ్యవహారం ఎన్నికల సంఘం పరిధిలోనిదన్న బండి

**కరీంనగర్, అక్షరకలం ప్రతినిధి**

భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ కాలం ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును నరేంద్ర మోదీ బ్రేక్ చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందిస్తున్న రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్టలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం' అని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు



# ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధారణ ప్రజలకు మాత్రమే

### రౌడీలు, గూండాల పట్ల కఠినంగానే వ్యవహరిస్తాం

### గంజాయి సాగు చేస్తే రైతు సంక్షేమ పథకాలు నిలుపుదల

### సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం

### రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ స్పష్టీకరణ

**ఆదిలాబాద్, అక్షరకలం ప్రతినిధి**



తెలంగాణలో పోలీసింగ్ విధానంలో కీలక మార్పులకు సంకేతాలు ఇస్తూ డీజీపీ సీవీ ఆనంద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అనే పేరుతో నేరస్తుల పట్ల సానుభూతి ఉండదని, ప్రజలను గౌరవిస్తాం.. కానీ రౌడీలు, గుండాలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మావోయిజం పూర్తిగా అంతమైందన్నారు. ఈ నేపథ్యంలో గ్రేహౌండ్స్ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని కొత్త విభాగాలకు బదిలీ చేస్తూ, వారి సేవలను ఇతర కీలక రంగాల్లో వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రానికి గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా పెద్ద సవాల్‌గా మారిందని డీజీపీ పేర్కొన్నారు. వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రగ్స్ ముఠాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. అదేవిధంగా సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, సైబర్ క్రైమ్ ఇప్పుడు పోలీసు శాఖకు ప్రధాన సవాల్‌గా మారిందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని డీజీపీ ప్రశంసించారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థ సైతం మారాల్సిన అవసరం ఉందని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇక, ప్రజలకు భరోసా ఇచ్చే పోలీసింగ్ కొనసాగుతుంది. కానీ చట్టాన్ని చేతిలోకి తీసుకునే రౌడీలు, గూండాలకు మాత్రం కఠినమైన పోలీసింగ్ తప్పదనే విషయం గుర్తుంచుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో.. 1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు.

# మోడీకి వివిధ దేశాల నేతల అభినందనలు

### ఎక్స్ వేదికగా విషెస్ తెలిపిన మెలోనియా

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

ప్రధానమంత్రిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వివిధ దేశాధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరుదేశాల మధ్య బలపడుతోన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన మోదీకి నా అభినందనలు. ఇటీవల రోమ్‌లో మళ్లీ మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది. ఇరుదేశాల ప్రజల కోసం కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ఒక ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంయుక్తంగా ప్రారంభించడం కూడా మంచి విషయం' అని మెలోనీ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు కలిసి ఉన్న ఫొటోను ఆమె పంచుకున్నారు. 'భారత్‌లో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన ప్రధాని మోదీకి అభినందనలు. ఈ ఘనత ఆయన దశాబ్దాల ప్రజాసేవకు, నాయకత్వానికి ఒక శక్తిమంతమైన నిదర్శనం' అని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. చారిత్రక మైలురాయికి చేరుకున్న ప్రధాని మోదీకి అభినందనలు. భారతదేశ అభివృద్ధి, శ్రేయస్సు, ప్రపంచ వేదికపై దాని స్థానాన్ని పెంపొందించడంలో ఆయన ఎంతో కృషి చేశారు. భారత్‌తో ఉన్న సన్నిహిత, సుదీర్ఘ స్నేహాన్ని మలేషియా గౌరవిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు మన ప్రజలకు అవకాశాలను విస్తరించడంలో సహకారాన్ని కొనసాగించేం దుకు నేను ఎదురుచూస్తున్నా. మోదీ ఇలాంటి మరెన్నో ఘనతలు సాధించాలని.. భారత ప్రజలు శాంతి, శ్రేయస్సులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నా అంటూ మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం అభినందనలు తెలిపారు.

# నాలుగో నగర కల సాకార దిశగా మరో అడుగు..

## ఎఫ్‌సీడీఏ భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**





హైదరాబాద్‌కు అనుసంధానంగా మరో భవ్య నగరం నిర్మించాలన్న సంకల్పానికి మరో అడుగు పడింది. భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో నిర్మించతలపెట్టిన ఈ నాలుగో నగరానికి అవసరమైన పరిపాలనా భవన నిర్మాణం పూర్తయింది. మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. దాదాపు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో, 16 వేల చదరపు అడుగులకు పైగా నిర్మాణ విస్తీర్ణంతో ఎఫ్‌సీడీఏ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. అత్యాధునిక సౌకర్యాలు, ఆధునిక హంగులతో కూడిన ఈ భవన నిర్మాణాన్ని కేవలం ఆరు నెలల వ్యవధిలోనే పూర్తి చేశారు. ఈ భవనానికి సీఎం రేవంత్ రెడ్డి 2025 సెప్టెంబర్ 28న శంకుస్థాపన చేయగా, అదే ఏడాది డిసెంబర్‌లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తర్వాత వేగంగా పనులు చేపట్టిన అధికారులు, జూన్ 10న ఈ భవనాన్ని పూర్తిచేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు కులీ కుతుబ్ షాహీలు నిర్మించిన హైదరాబాద్ తొలి నగరం కాగా.. దానికి ఆనుకొని రెండో నగరంగా సికింద్రాబాద్ నగరాన్ని మూడో నిజాం సికందర్ జా పేరుమీద ఏర్పాటు చేశారు. 1798లో నిజాం మరియు బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ మధ్య కుదిరిన ఒప్పందం అనంతరం హుస్సేన్ సాగర్ ఉత్తర భాగంలో బ్రిటిష్ సైనిక శిబిరం (కంటోన్మెంట్) ఏర్పాటైంది. బ్రిటీషర్ల పాలనలోనే అభివృద్ధి చెందింది. ఇక శాస్త్ర సాంకేతిక రంగం అభివృద్ధి చెందాక హైటెక్ సిటీ ప్రాంతంలో ఏర్పాటైన నగరం సైబరాబాద్. ఈ మూడో నగరాన్ని నిర్మించిన క్రెడిట్ ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇస్తారు. ఆయన హయాంలోనే వివిధ సంస్థల ఏర్పాటు, సైబరాబాద్ పోలీసు కమిషనరేటు ఏర్పాటయ్యాయి. ఇక తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని, పరిపాలనలో తనకంటూ ఓ ముద్ర వేసుకోవాలని భావిస్తున్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ నాలుగో నగరాన్ని నిర్మించాలని సంకల్పించారు. దానిపేరే భారత్ ఫ్యూచర్ సిటీ.





అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ట్రంప్‌కు వీసా దెబ్బ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్–1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్–1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్–1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్–1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్–1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్–1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్–1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును



స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రయాపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్–1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్–1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# ధాన్యం కొనుగోలులో అక్రమాలు నిరూపిస్తే రాజీనామా చేస్తా..

## ధర్మపురిలో ఇసుక తవ్వకాలు స్థానిక అవసరాలకే..

## జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలులో కొత్త రికార్డు..

## రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల జూన్ 10




జిల్లాలో యాసంగి సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యంలో ఏలాంటి అక్రమాలు లేవని ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్కార్యాలయంలోఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ గత యాసంగి సీజన్ లో జగిత్యాల జిల్లాలో 80వేల మంది రైతుల వద్ద 4.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఈఏడాది యాసంగి సీజన్లో జిల్లాలో 5.12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఇప్పటి వరకు 5.08లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. జిల్లాలో మొత్తం 436 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రస్తుతం 417 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యాయని మంత్రి వివరించారు. మరో 19కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి వివరించారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటి వరకురూ.1,215కోట్లు విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటి వరకు 79,736 మంది రైతుల ఖాతాల్లో రూ. 1,075కోట్లు జమ చేసినట్లు మంత్రి తెలిపారు. రాత్రి, పగలు తేడా లేకుండ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో 24గంటల పాటు అందుబాటులో ఉంటు రైతులకు సహకరించిన అధికారులను ఈసందర్భంగా మంత్రి అడ్లూరి అభినందనలు తెలిపారు. వడ్ల కొనుగోలులో ఏలాంటి అక్రమాలు లేవు..జగిత్యాల జిల్లాలో వడ్ల కొనుగోలులో ఏలాంటి అక్రమాలు లేవని మంత్రి అడ్లూరి అన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డితో పాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వడ్ల కొనుగోలులో జగిత్యాల జిల్లాలో రూ. 107కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారని, వారు ఆరోపించినట్లు అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి అడ్లూరి అన్నారు. ప్రభుత్వంపై బురద జల్లె కార్యక్రమంలో భాగంగా ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి ఆరోపించారు. జీవన్రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద కొనుగోలు చేస్తే అవినీతి జరుగలేదు కాని జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లితేనే వడ్ల కొనుగోలులో అవినీతి జరిగిందా అని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. ధర్మపురి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణపై ప్రతిపక్షలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయనిమంత్రి అడ్లూరి అన్నారు.

# మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం.. పచ్చదనానికి పోలీసుల చేయూత

## యువతకు అవగాహన కల్పిస్తూ మొక్కలు నాటిన వన్‌టౌన్ పోలీసులు

మహబూబ్‌నగర్, జూన్ 10. అక్షర కలం :



మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటి సమాజానికి సానుకూల సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును చీకటిమయం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

అదే సమయంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందితేనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ అనే రెండు ప్రధాన లక్ష్యాలతో జిల్లా పోలీసు శాఖ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర్ హాజరై పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# "మీ కోసం ఒక కుటుంబం ఎదురుచూస్తోంది"

## హెల్మెట్.. సీటుబెల్ట్ ప్రాణరక్షక కవచాలు

## రోడ్డు భద్రతపై డీజీపీ స్వాతి లక్రా అవగాహన

## 100 హెల్మెట్ల ఉచిత పంపిణీ

మహబూబ్ నగర్. బాలానగర్, జూన్ 10. అక్షర కలం:



"వాహనం నడిపేటప్పుడు మీ కోసం ఒక కుటుంబం ఇంట్లో ఎదురుచూస్తోందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో జరిగే మరణాలను గణనీయంగా తగ్గించవచ్చు" అని తెలంగాణ డీజీపీ (ఆర్గనైజేషన్ అండ్ హోంగార్డ్స్) స్వాతి లక్రా, ఐపీఎస్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక–99 రోజుల కార్యాచరణ'లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బాలానగర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం నిర్వహించిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన స్వాతి లక్రా, రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులను వివరించారు. హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పేర్కొంటూ, ఆ సమయంలో వైద్య సహాయం అందితే ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి ప్రమాదాలకు కారణమయ్యే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చిన ఆమె, గుడ్ సమారిటన్ నిబంధనల ప్రకారం సహాయం చేసే వారికి చట్టపరమైన రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. బాధితులను ఆస్పత్రులకు తరలించడంలో భయపడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం డీజీపీ స్వాతి లక్రా చేతుల మీదుగా ప్రజలకు 100 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ వాణి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ మహేష్, బాలానగర్ ఎస్ఐ నరేందర్, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఆటో, క్యాబ్, భారీ వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి 'తెలంగాణ' మార్గనిర్దేశం

## అక్కడ 'ఫార్మా హబ్' ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం

## రిపబ్లిక్ ఆఫ్ ఘనా ఉన్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి :

హైదరాబాద్ : జూన్ 10, ( అక్షర కలం న్యూస్ ):



రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా 'తెలంగాణ – – ఘనా' మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామికరంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీ'లను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

# జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ సర్క్యులర్ జారీ

## సర్క్యులర్లు జారీ పట్ల జిల్లా విద్యాశాఖ.. ఇంటర్ విద్యాశాఖ అధికారులకు జర్నలిస్టుల కృతజ్ఞతలు


అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం: ఖమ్మం జిల్లాలో జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైన్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కే. రవిబాబు లు సర్క్యులర్ ను జారీ చేశారు. జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు లతో కూడిన జర్నలిస్టు బృందం ఈనెల ఐదవ తేదీన జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన విషయం తెలిసిందే.. టిజేఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ బృందం చేసిన విజ్ఞప్తి మేరకు డి ఈ ఓ, డిఐఈ ఓ జిల్లా అధికారులు స్పందించి బుధవారం జర్నలిస్టు ప్రతినిధులకు సర్కలర్లను అందజేశారు. టీయూడబ్ల్యూజే ( టి జే ఎఫ్) జిల్లా కమిటీ జర్నలిస్టుల బృందం విజ్ఞప్తి మేరకు విద్యాశాఖ అధికారులు సర్కులర్లు జారీ చేయటం పట్ల జర్నలిస్టు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మెట్రో ఈవినింగ్ ఎస్ .వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యక్షులు రేపాక యాదగిరి, ఉల్లోజు రమేష్ , పానకాలరావు,కమిటీ సభ్యులు ఇసంపల్లి వెంకటేశ్వర్లు, బి. అప్పారావు, రోజా, పెంటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# చరిత్ర సృష్టించిన భారత్

## టెస్ట్ డెబ్యూ లోనే మానవ్ సుతార్ హిస్టారికల్ రికార్డ్..

ఇండియా వర్సెస్ అఫ్గానిస్తాన్ ఏకైక టెస్ట్ మ్యాచ్ సెకండ్ డే ఆటలో ఒక వండర్‌ఫుల్ సీన్ కనిపించింది. టీమిండియా యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ డెబ్యూ మ్యాచ్ లోనే అద్భుతమైన ఇంపాక్ట్ చూపించాడు. న్యూ చండీగఢ్ లోని ముల్లాన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టీ టైమ్ కంటే జస్ట్ ముందే బాల్ ను సుతార్ కు ఇచ్చాడు. క్రీజులోకి వచ్చిన ఈ 23 ఏళ్ల యంగ్ ప్లేయర్ కేవలం నాలుగు బాల్స్ లోనే తన టాలెంట్ ఏంటో ప్రూవ్ చేసుకున్నాడు.మానవ్ సుతార్ వేసిన ఫస్ట్ ఓవర్ ఫోర్త్ బాల్ కు అఫ్గాన్ ఓపెనర్ అబ్దుల్ మాలిక్ స్వీప్ షాట్ కొట్టడానికి ట్రై చేశాడు. అయితే బాల్ టాప్ ఎడ్జ్ అయి గాల్లోకి లేవగా, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ నుంచి మొహమ్మద్ సిరాజ్ ముందుకు డైవ్ చేస్తూ ఒక షార్ప్ క్యాచ్ ను అందుకున్నాడు. ఈ వికెట్ పడగానే టీమిండియా ప్లేయర్స్ అందరూ సుతార్ ను హగ్ చేసుకుంటూ గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సాలిడ్ బ్రేక్‌థ్రూతో సుతార్ తన కెరీర్ లోనే మర్చిపోలేని మెమరబుల్ మూమెంట్ ను సొంతం చేసుకున్నాడు. ఇండియా టెస్ట్ క్రికెట్ హిస్టరీలో డెబ్యూ మ్యాచ్ లోనే ఫస్ట్ ఓవర్ లో వికెట్ తీసిన ఎనిమిదో ఇండియన్ క్రికెటర్ గా మానవ్ సుతార్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశాడు. దాదాపు 8 దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ అరుదైన క్లబ్ లో ఇంతకుముందు మొంటు బెనర్జీ (1948), మనోహర్ హార్డికర్ (1958), వామన్ కుమార్ (1961), చేతన్ శర్మ (1984), డబ్ల్యూవీ రామన్ (1988), నిలేష్ కుల్కర్ణి (1997), టిను యోహానన్ (2001) మాత్రమే ఉన్నారు. 2001 లో ఇంగ్లాండ్ పై టిను యోహానన్ ఈ ఫీట్ సాధించిన తర్వాత మళ్లీ 25 ఏళ్ల వరకు ఏ ఇండియన్ బౌలర్ కూడా ఫస్ట్ ఓవర్ లో వికెట్ తీయలేదు. ఆ రికార్డును సుతార్ ఇప్పుడు రిపీట్ చేశాడు. స్పిన్ ఆల్ రౌండర్ హర్ష్ దూబేను పక్కన పెట్టి మానవ్ సుతార్ ను టీమ్ లోకి తీసుకోవడం పర్ఫెక్ట్ డెసిషన్ అని సుతార్ నిరూపించాడు. మ్యాచ్ స్టార్ట్ కావడానికి ముందు సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ చేతుల మీదుగా సుతార్ టెస్ట్ క్యాప్ నంబర్ 319 ను అందుకున్నాడు. 2021 లో అక్షర్ పటేల్ డెబ్యూ చేసిన తర్వాత టీమిండియా తరఫున టెస్ట్ ఫార్మాట్ లో ఎంట్రీ ఇచ్చిన ఫస్ట్ స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ గా మానవ్ సుతార్ నిలిచాడు.

ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఏకైక టెస్టులో అఫ్ఘనిస్థాన్ జట్టు చిత్తు చిత్తుగా ఓడింది. తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయిన అఫ్ఘన్.. రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ముగించింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 564/8 పరుగులు చేయడంతో.. ఈ టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టెస్టుతో డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ఓవరాల్‌గా ఏడు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. భారత్ - అఫ్ఘనిస్థాన్ మధ్య జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లో ముగిసిన ఈ టెస్టులో టీమిండియా ఆధిపత్య ధోరణి ప్రదర్శించింది. ఆరంభం నుంచి ఏకపక్షంగా సాగిన ఈ టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డబ్ల్యూటీసీ ఛాంపియన్ షిప్ 2025 - 27లో టీమిండియాకు ఈ విజయం చాలా సపోర్ట్ ఇవ్వనుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ టెస్టులో మూడో రోజు అఫ్ఘనిస్థాన్ రెండుసార్లు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో 113/5తో మూడో రోజు ఆట మొదలుపెట్టిన అఫ్ఘనిస్థాన్.. మొదటి సెషన్‌లోనే 152 పరుగులకే ఆలౌట్ అయింది. ఫాలో ఆన్ ప్రారంభించిన అఫ్ఘనిస్థాన్ లంచ్ బ్రేక్‌కి ముందు ఎలాంటి వికెట్లు కోల్పోలేదు. లంచ్ బ్రేక్ తర్వాత టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలి వికెట్ తీసుకోగా.. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లను పెవిలియన్‌కు క్యూ కట్టించాడు. ఓపెనర్ సెడికుల్లా అటల్ క్రీజులో ఉన్నంత సేపు కొంచెం పోరాడిన అఫ్ఘనిస్థాన్ ఆ తర్వాత నుంచి కుప్పకూలింది. దాంతో మూడో రోజు ఆట మిగిలుండగానే అఫ్ఘనిస్థాన్ కేవలం 112 పరుగులకే ఆలౌట్ అయింది. అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లలో సెడికుల్లా అటల్ 42, రహ్మానుల్లా గుర్బాజ్ 24, రహ్మత్ షా 13 పరుగులు చేయగా.. మిగతా అందరూ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ బాట పట్టారు. భారత బౌలర్లలో సుందర్ 4, కుల్దీప్




3, మానవ్ సుతార్ 1, సిరాజ్ 1 వికెట్ పడగొట్టారు. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 127 ఓవర్లు ఆడి 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి డిక్లేర్ ఇచ్చింది. కేఎల్ రాహుల్ 100, శుభ్‌మన్ గిల్ 126, సాయి సుదర్శన్ 81, రిషభ్ పంత్ 81, వాషింగ్టన్ సుందర్ 52 పరుగులు చేశాడు. ఈ టెస్టుతో ఎంట్రీ ఇచ్చిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు, రెండో ఇన్నింగ్స్ ఒకటి ఓవరాల్‌గా ఏడు వికెట్లు పడగొట్టి రికార్డు సృష్టించాడు. 412 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అఫ్ఘానిస్థాన్ 35.5 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ సెదిఖుల్లా అటల్(80 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 42), రెహ్మానుల్లా గుర్బాజ్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. వాషింగ్టన్ సుందర్(3/30), కుల్దీప్ యాదవ్(4/36) అఫ్గాన్ పతనాన్ని శాసించారు. మానవ్ సుతార్‌కు ఒక వికెట్ దక్కింది. గాయంతో షరాఫుద్దిన్ అష్రఫ్ బ్యాటింగ్‌కు రాలేదు. 14 పరుగుల వ్యవధిలోనే అఫ్గాన్ చివరి 6 వికెట్లు కోల్పోవడం గమనార్హం.భారత బౌలర్లలో మానవ్ సుతార్(6/33) 6 వికెట్లతో అఫ్గాన్ పతనాన్ని శాసించగా.. ప్రసిధ్ కృష్ణ(3/37) మూడు వికెట్లతో సత్తా చాటాడు. వాషింగ్టన్ సుందర్(1/21) ఒక వికెట్ దక్కింది. భారత్‌కు 412 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. టెస్ట్ క్రికెట్ అనుభవలేమి అఫ్గాన్ కొంపముంచింది. అఫ్గాన్ బ్యాటింగ్ వైఫల్యంతో మూడో రోజు ఆటలో రెండున్నర సెషన్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

## టెస్టుల్లో అతిపెద్ద విజయం..!

టెస్ట్ క్రికెట్‌లో భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో 94 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలోనే కని వినీ ఎరుగని విజయాన్ని కైవసం చేసుకుంది. ఈ మ్యాచు ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. దీంతో భారత గడ్డపై టెస్టుల్లో అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది.ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 564/8 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ ఇచ్చింది. అనంతరం తమకు అలవాటైన రీతిలో స్పిన్‌తో ప్రత్యర్థికి ఉచ్చు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘానిస్థాన్‌ను 152 పరుగులకు కుప్పకూల్చింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఫాలో ఆన్ ఆడించింది. రెండో ఇన్నింగ్స్ మరింత చెలరేగిపోయిన భారత బౌలర్లు.. అఫ్ఘానిస్థాన్‌ను 112 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసింది. సొంత గడ్డపై అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. తాజా ఫలితంతో టెస్టుల్లో అతిపెద్ద విజయం సాధించిన రెండో ఆసియా టీమ్‌గా టీమిండియా నిలిచింది. ఈ జాబితాలో భారత్ కంటే పాకిస్థాన్ ముందు వరుసలో ఉంది. 2002లో లాహోర్‌లో న్యూజిలాండ్‌పై పాకిస్థాన్ ఇన్నింగ్స్ ౘ 324 పరుగుల తేడాతో విక్టరీ నమోదు చేసింది.ఈ మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్ డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ప్లేయర్ ఆఫ్ ది అవార్డు గెలుచుకున్నాడు. ఈ మ్యాచులో బ్యాటింగ్‌లో 28 రన్స్ చేసిన అతడు.. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ తీశాడు. దీంతో టీమిండియా తరఫున ఆడిన తొలి మ్యాచులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA




## పెద్దిలో మంచి పాత్రను చేశా

### జాన్వీని ట్రోల్ చేయడం


### తగదన్న జగపతిబాబు

'పెద్ది' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో 'అప్పలసూరి' పాత్రలో నటించిన జగపతిబాబు, 'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని పేర్కొన్నారు. మధ్యలో ఎన్నో సినిమాలు చేసినప్పటికీ, ఈ సినిమా విడుదల కోసం ప్రత్యేకంగా ఎదురుచూశానని తెలిపారు. చిత్రం విడుదల తర్వాత ఒక ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి, 'ఇంత గొప్ప పాత్ర చేసినా మీ గురించి పెద్దగా చర్చ జరగడం లేదు. ఇదే పాత్రను మరో భాష నటుడు చేసి ఉంటే ఇప్పటికే ఎన్నో అవకాశాలు వచ్చేవని చెప్పినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో నటులకు లభించే గుర్తింపు గురించి కూడా జగపతిబాబు మాట్లాడారు. 'చాలా సందర్భాల్లో పరభాష నటులకు ఎక్కువ గౌరవం దక్కుతుంది. నేను ఇతర భాషల్లో పని చేసినప్పుడు కూడా అలాంటి ఆదరణను చూశాను.




## జీ కి దక్కిన వృషకర్మ శాటిలైట్ హక్కులు ?

తండేల్ తర్వాత అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ 'వృషకర్మ' మూవీకి విరూపాక్ష ఫేం కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్నాడు. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లక్కీ భాస్కర్ ఫేం మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తోంది.. 2026 డిసెంబర్‌లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట హల్‌చల్ చేస్తోంది. వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను పాపులర్ టీవీ ఛానల్ జీ తెలుగు దక్కించుకున్నట్టు సమాచారం. జీ తెలుగు భారీ మొత్తానికి వృషకర్మ శాటిలైట్ రైట్స్‌ను కొనుగోలు చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. దీనికి సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన కూడా చేయనున్నారట మేకర్స్. వృషకర్మ లో 'లాపతా లేడీస్' ఫేం స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా కనిపించనుండటంతో.. ఇంతకీ క్రేజీ యాక్టర్‌ను డైరెక్టర్ కార్తీక్ దండు ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై స్టార్ డైరెక్టర్ సుకుమార్ బీవీఎస్ఎన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి.లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు.



## పెద్ది కలెక్షన్ల సునామీ

### 300 కోట్ల వసూళ్లకు చేరువలో వసూళ్లు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. విడుదలైన మొదటి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండో రోజు రూ.46.44 కోట్లు, మూడో రోజు రూ.54.90 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే రూ.236.7 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ఆదివారం కూడా అదే జోరు కొనసాగించిన 'పెద్ది' మొదటి వీకెండ్ ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా రూ.292.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ, సినిమాను 'బాక్సాఫీస్ ఛాంపియన్'గా అభివర్ణించింది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి కీలక మార్కెట్లలో రామ్ చరణ్‌కు ఉన్న క్రేజ్ మరోసారి ఈ వసూళ్ల ద్వారా స్పష్టమైంది. నాలుగు రోజుల్లోనే దాదాపు రూ.300 కోట్లకు చేరువైన ఈ సినిమా, వీకెండ్‌లో కూడా ఇదే స్థాయిలో కలెక్షన్లు కొనసాగిస్తే త్వరలోనే రూ.500 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో నటించారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలకమైన కోచ్ పాత్రలో కనిపించగా, జగపతిబాబు 'అప్పలసూరి'గా, దివ్యేందు శర్మ మరో ముఖ్యమైన పాత్రలో నటించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఈనెల 17న నల్గొండకు సీఎం రేవంత్ రెడ్డి

## రూ.13వేల కోట్ల 'హ్యాం' రోడ్ల పనులకు శంకుస్థాపన

## కనగల్ సమీపంలో తెలంగాణలోనే భారీ బహిరంగ సభ

## వివరాలు వెల్లడించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నల్గొండ జిల్లాకు రానున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిమిత్తం నల్గొండ జిల్లాకు వచ్చిన మంత్రి మాన్యం చెల్క ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాల పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 13000 కోట్ల రూపాయలతో" హ్యాం రోడ్లను" నిర్మించనున్నామని, ఇందులో భాగంగా 6300 కిలోమీటర్ల రోడ్లను డబుల్ రోడ్డు గా మార్చేందుకు టెండర్లు పిలవడం జరిగిందని, పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపారు.





రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 17న సాయంత్రం కనగల్ సమీపంలో హ్యాం రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారని, అనంతరం ధర్వేశిపురం ఎల్లమ్మ దర్శనం చేసుకొనున్నారని తెలిపారు. పంచాయతీరాజ్ కి సంబంధించి మరో 7,000 కోట్ల రూపాయలతో నూతన రహదారులు నిర్మించనున్నట్లు చెప్పారు. హ్యాం రోడ్ల లో భాగంగా మొదటి ప్యాకేజీ కింద సిఆర్ఎఫ్ ద్వారా 300 కోట్ల రూపాయలతో ధర్వేశిపురం నుండి గుర్రంపోడు, కొండమల్లేపల్లి నుండి డిండి వరకు డబుల్ రోడ్డు చేపట్టడం జరిగిందని, మొత్తం 1334 ప్యాకేజీలుగా విభజించామని, 13000 కోట్ల రూపాయల పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. శంకుస్థాపన అనంతరం తెలంగాణలోనే భారీ బహిరంగ సమావేశాన్ని కనగల్ సమీపంలో ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. డబుల్ రోడ్ల నిర్మాణం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గడమే కాకుండా, పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని ,తద్వారా యువతకు ఉద్యోగాలు వస్తాయని మంత్రి తెలిపారు. నల్గొండ తో పాటు, వలిగొండ,ఆలేరు తదితర ప్రాంతాల కు కూడా 600 కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మించనున్నమని తెలిపారు. అలాగే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 125 కోట్ల రూపాయలతో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు ఈ వారంలో టెండర్లు పిలువనున్నామని ,నల్గొండ పట్టణాన్ని తెలంగాణలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు.

## ధరలు తగ్గించాలి

### నల్లగొండలో సిపిఐ భారీ ధర్నా




**అక్షరకలం నల్గొండ**

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని.. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం (సిపిఐ జిల్లా కార్యదర్శి) కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల బతుకులు దుర్భరంగా మారాయన్నారు. ఎన్నికలు ముగియగానే గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచడంపై మండిపడ్డారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 'రైతు భరోసా'ను రెండు ఎకరాలకే పరిమితం చేయకుండా, సాగు చేసే ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం అందించాలని.. ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.?పల్లా నర్సింహారెడ్డి (సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు) ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో జాప్యాన్ని నివారించి అర్హులందరికీ నిధులు ఇవ్వాలని, సాంకేతిక కారణాలతో ఆగిపోయిన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు.?గమనిక: హామీలు నెరవేర్చకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్ సహా పలువురు సిపిఐ ముఖ్య నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం..-- దోనూరు జైపాల్ రెడ్డి



**అక్షరకలం చౌటుప్పల్**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని చిమిర్యాల గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు చిమిర్యాల గ్రామ మాజీ సర్పంచ్ దొనూరి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులు మల్లేపల్లి మోహన్ రెడ్డి 60,000, వేల రూపాయలు మల్లేపల్లి బాలమణికి 55,000,సుర్వి పద్మ,శంకరయ్యలకు 23,500, వేల రూపాయలు,దామ ముత్యాలుకి 60,000, ముద్దంగుల ముత్తమ్మకి 11,000, సూర్వీ వెంకటయ్యకి 18,000,వేల రూపాయలు మంజూరైన చెక్కులను అందించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దోనూరి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఆరోగ్య అవసరాల నిమిత్తం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రజలు ఇలాంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చిమిర్యాల గ్రామ ఉప సర్పంచ్ అండాలు యాదయ్య,వార్డు సభ్యులు దామ మల్లేష్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కేశాని దిలీప్,కేశాని రాజు,సూర్వి ముత్యాలు,మర్రి ఇస్తారి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, లబ్ధిదారులు,గ్రామ ప్రజలు,తదితరులు, పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు 'కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' కొండంత అండ -- ఎమ్మెల్యే బాలు నాయక్

**అక్షరకలం దేవరకొండ**

పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు 'కళ్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని 246 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 2,46,28,536 విలువైన చెక్కులను ఆయన ఘనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ఎన్నికల హామీలన్నింటినీ అమలు చేసేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకుని, అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకుని ప్రయోజనం పొందాలని కోరారు. రాబోయే రోజుల్లో అధికారుల సమన్వయంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అర్హులందరికీ 'ఇందిరమ్మ ఇండ్లు' అందేలా చర్యలు: ఎమ్మెల్యే బాలు నాయక్



**అక్షరకలం దేవరకొండ:**

నియోజకవర్గంలోని అర్హులైన పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలు తీసుకుంటామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు. బుధవారం ఆయన నియోజకవర్గ ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపికపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. పొరపాటున ఎవరైనా అర్హులు ఎల్3 జాబితాలో ఉంటే, పరిశీలించి ఎల్1 లోకి మారుస్తామని చెప్పారు. నియోజకవర్గంలో ఉన్న 226 గుడిసెలను తొలగించి, ఆ కుటుంబాలకు శాశ్వత గృహాలు అందించి గుడిసెలు లేని దేవరకొండగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. లబ్ధిదారులు ఇప్పటికే నిర్మించుకుంటున్న ఇండ్ల దశలను బట్టి పథకంలోకి మార్చి నిధులు జమ చేస్తామని, మొదటి విడత పెండింగ్ బిల్లులను త్వరలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ఎవరైనా అవినీతికి పాల్పడితే సస్పెండ్ చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ సమావేశంలో హౌసింగ్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## చదువుతోనే జీవితాలు మారతాయి

### ---మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**అక్షరకలం నల్గొండ**

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ జిల్లా తిప్పర్తి మండలంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అకాడమిక్ సంవత్సరం నుండి రాష్ట్రంలోని 3.5 లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు, మధ్యాహ్న భోజనం అందించనున్నామని తెలిపారు. తిప్పర్తి, కనగల్ మండలాల్లో ఒక్కొక్కటి రూ.6 కోట్లతో మంజూరైన అధునాతన జూనియర్ కళాశాల భవన నిర్మాణాలను 6 నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇంటర్ కళాశాలల్లో కంప్యూటర్ విద్యతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ ) బోధించనున్నారు. ఇప్పటికే ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బొట్టుగూడా పాఠశాలలో ఏఐ అందిస్తున్నారు.విద్యార్థులు పదో తరగతి తర్వాత చదువు ఆపకూడదని, ఉద్యోగ అవకాశాల కోసం నల్గొండలో న్యాక్, సెట్వి సంస్థలను ఏర్పాటు చేశామని తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో



నిర్మించిన 100 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను జూలై 1 నాటికి అన్ని వసతులతో గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గృహప్రవేశాల సందర్భంగా తన వంతుగా ఒక్కో లబ్ధిదారుడికి రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. నల్గొండ కలెక్టరేట్ వెనుక నిర్మించిన ఇండ్లను కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రతి మండలంలో ఒక రైస్ మిల్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ?ఇటీవల రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.500 కోట్ల వడ్డీ లేని రుణాలను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూసేకరణ బాధితులకు న్యాయం చేయాలి

### --- సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్



**అక్షరకలం బిబినగర్**

రైల్వే ప్రాజెక్టుల భూసేకరణలో బాధితులకు పూర్తి న్యాయం చేయాలని బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్--యాదాద్రి, యాదాద్రి--కాజీపేట రైల్వే లైన్ల విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. బీబీనగర్, గూడూరు, కొండమడుగు, అనంతారం గ్రామాల్లో సేకరిస్తున్న నివాస భూములకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలి. భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోతున్న వ్యాపారులకు ప్రత్యేక ప్యాకేజీ అందించాలి. ఇళ్లు పూర్తిగా కోల్పోయిన కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలం లేదా సమగ్ర పునరావాసం కల్పించాలి. ఈ సమస్యలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## రాఘవాపురంలో ముగిసిన '99 రోజుల ప్రణాళిక' ప్రత్యేక గ్రామసభ

**అక్షరకలం బీబీనగర్**



యాదాద్రి భువనగిరి జిల్లా బిబినగర్ మండలంలోని రాఘవాపురం గ్రామంలో 99 రోజుల ప్రణాళిక ముగింపు సందర్భంగా ప్రత్యేక గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు గ్రామ సర్పంచ్ శ్రీ సిద్దగోని శ్రీకాంత్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధికారులు గ్రామాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి (బీబీనగర్ ఎంపీడీవో) ?రాకేష్ ( పి ఆర్ ఏఈ ), రవికిరణ్ ( ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ) అమూల్య ( ఏఈఓ ), డాక్టర్ వి.సుష్మకవిత (గ్రామ సెక్రటరీ) విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్?ఈ సభలో ఉపసర్పంచ్ సిలువేరు కవిత మహేష్‌తో పాటు వార్డు సభ్యులు తోరుపునూరి రవి గౌడ్, న్యాలపట్ల అజయ్, జక్కి నగేష్, రక్తని పూర్ణిమ కుమార్, బండారి అశ్విని రాఘవేందర్, గుంటిమిది విజయలక్ష్మి రవీందర్ మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం అనే పిలుపుతో ఈ ప్రత్యేక గ్రామసభ విజయవంతంగా ముగిసింది.

## జిల్లాలో నీట్ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

**సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..**



జిల్లాలో నిర్వహించనున్న నీట్ (చీజుజు-ఖ+) పరీక్షను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు ఆదేశించారు.జూన్ 21న మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,924 మంది అభ్యర్థులు నీట్ పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# నల్గొండను సస్యశ్యామలం చేయడమే మా ధ్యేయం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

### సాగునీరు, రహదారులపై అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష

### ధాన్యం సేకరణలో నల్గొండ నంబర్ వన్ కావడంపై హర్షం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



నీటిపారుదల,రహదారులు, వ్యవసాయం,అన్ని రంగాలలో నల్గొండ జిల్లాను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రైతు సంక్షేమం ప్రధాన ధ్యేయంగా తమ ప్రభుత్వం రైతుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. బుధవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయం ఇందిరా భవన్లో జిల్లా అధికారులతో సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.నల్గొండ జిల్లా అంతటికి సాగునీరు అందించి జిల్లాను సస్యశ్యామలం చేయడమే ధ్యేయమని, అందుకే ఏ ఎం ఆర్ పి కాలువల లైనింగ్, బ్రాహ్మణ వెల్లెముల, ఎస్ఎల్బీసీ సొరంగం వంటివి చేపట్టినట్లు తెలిపారు.బ్రాహ్మణ వెల్లెముల ప్రాజెక్టు కింద పెండింగ్లో ఉన్న మైనర్లు, సబ్ మైనర్ల పై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా నార్కెట్పల్లి మండలం, కొండపాకోని గూడెంలో ఒక రైతుకు సంబంధించిన పొలంలో 40 మీటర్ల మేర కాలువ పనులు ఆగిపోయిన విషయం అధికారులు మంత్రికి దిష్టికి తీసుకురాగా , జిల్లా కలెక్టర్ నిదుల నుండి రైతుకు నష్టపరిహారం మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని మంత్రి అక్కడికక్కడే కలెక్టర్ ను ఆదేశించారు. కొండపాకోని గూడెం చెరువు నిండితే దోమలపల్లి చెరువు నిండుతుందని, తద్వారా ఇతర చెరువులు నింపుకునేందుకు అవకాశం ఉందని, మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు.ధాన్యం సేకరణలో నల్గొండ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం పట్ల ఆయన జిల్లా కలెక్టర్ ను అభినందించారు. నల్గొండ జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో ధాన్యం పండిందని, అయితే ప్రతి సీజన్లో రైతులు వరినే పండించకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. పంట మార్పిడి పై అధికారులతో పాటు, మహిళా సంఘాలు అందరూ అవగాహన కల్పించాలన్నారు. ఆర్ అండ్ బి రహదారులపై సమీక్ష సందర్భంగా నార్కెట్ పల్లి వద్ద ఆర్ఓబి పనులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని, మిగిలిపోయిన భూసేకరణకు సంబంధించి చెల్లింపులు చేసి పిఎన్ జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేస్తూ పనులు వేగవంతం చేసేందుకు కలెక్టర్ వద్ద ఉన్న నిధులను వినియోగించుకోవాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్ రెడ్డి, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిచ్చయ్య, పౌర సరఫరాల డిఎం రామ్ పతి నాయక్, ఇతర అధికారులు ఉన్నారు.

# ప్రమాద బాధితులకు క్యాష్ లెస్ చికిత్స అందించాలి

### -డీజీపీ వివి శ్రీనివాసరావు

### హెల్మెట్ లేకపోతే ఫోటో తీసి పోలీసులకు ఫిర్యాదు

### వెలిమినేడు పంచాయతీ వినూత్న తీర్మానం





అక్షరకలం చిట్యాల

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుల ప్రాణాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యమని, వారికి ఆసుపత్రులు తక్షణమే నగదు రహిత చికిత్స అందించేందుకు ముందుకు రావాలని తెలంగాణ డీజీపీ, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ చైర్మన్ వివి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బాధితులకు అందించిన చికిత్సకు సంబంధించిన ఫీజులను ప్రభుత్వమే తర్వాత చెల్లించేలా త్వరలోనే తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. ?బుధవారం నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి అధ్యక్షతన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'రోడ్డు భద్రత – ప్రమాదాల నివారణ' అవగాహన సదస్సులో డీజీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ?వేగం కన్నా ప్రాణమే మిన్న అని , ?ఏడాదికేడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరగడంపై డిజిపి ఆందోళన వ్యక్తం చేశారు. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడమే ప్రధాన కారణాలని ఆయన విశ్లేషించారు. వేగం కన్నా ప్రాణాలు ముఖ్యం అని మనం క్షేమంగా ఇంటికి చేరాలనే లక్ష్యంతోనే వాహనాలు నడపాలి అని హితవు పలికారు. నల్లగొండ జిల్లా పోలీసు యంత్రాంగం తీసుకున్న ప్రత్యేక చర్యలు, వెలిమినేడు గ్రామంలో కల్పించిన అవగాహన వల్ల ఇక్కడ ప్రమాదాల సంఖ్య సగానికి సగం తగ్గడం అభినందనీయమన్నారు. ?ప్రమాదం జరిగిన మొదటి గంట బాధితుడిని ఆసుపత్రికి చేర్చగలిగితే 80 నుంచి 90 శాతం ప్రాణాలు కాపాడవచ్చని డీజీపీ తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి మానవత్వాన్ని చాటుకునే వారి కోసం కేంద్ర ప్రభుత్వం రహబీర్ అవార్డు' ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఈ అవార్డు కింద బాధితుడిని కాపాడిన వ్యక్తికి రూ. 25,000 నగదు బహుమతితో పాటు ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందజేస్తారని వివరించారు. అలాగే, రోడ్డు భద్రతా నియమాలను పర్యవేక్షించేందుకు త్వరలోనే ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ను ప్రారంభించనున్నట్లు డీజీపీ ప్రకటించారు. లనంతరం నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి సభలో ఉన్న ప్రతి ఒక్కరితో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.. ఈ సందర్భంగా వెలిమినేడు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని వాహనదారులందరూ విధిగా హెల్మెట్ ధరించేలా ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. ఒకవేళ ఎవరైనా హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే, గ్రామస్తులు ఎవరైనా సరే వారిని ఫోటో తీసి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మాన పత్రాన్ని సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు సభా ముఖంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, తహసీల్దార్ విజయ్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# బడిబాట వేళ.. పైరవీల ఆట.!

### అక్రమ డిప్యూటేషన్ల పర్వం.. విద్యాశాఖ పరువు తీస్తున్న కొందరి స్వార్థం.!

### నల్గొండ జిల్లాలో అక్రమాలకు తెరలేపిన కొందరు ఉపాధ్యాయులు

### విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే జోరుగా పైరవీలు.. టీఎస్ యుటిఎఫ్ తీవ్ర ఆగ్రహం

### నిబంధనలు మీరితే ఆందోళనల ఉప్పెనే

### డీఈవో సుశీందర్ రావుకు సంఘం వినతిపత్రం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 'బడిబాట' పట్టి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు నడిపించేందుకు ప్రయత్నిస్తుంటే..నల్గొండ జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు మాత్రం విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే తమకు నచ్చిన చోటుకు వెళ్లేందుకు 'అక్రమ డిప్యూటేషన్ల' పైరవీలకు తెరలేపారు. విద్యార్థుల అవసరాలను, విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ డిప్యూటేషన్ల పర్వం జిల్లా విద్యాశాఖ పరువును బజారున పడేస్తోందని 'తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్' టీఎస్ యుటిఎఫ్ నిప్పులు చెరిగింది. బుధవారం నల్లగొండ జిల్లా టీఎస్ యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బక్క శ్రీనివాసా చారి అధ్యక్షతన అత్యవసరంగా నిర్వహించిన 'జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం'లో ఈ అక్రమాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న అక్రమ సర్దుబాట్లపై సంఘం ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

#### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా.?

సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం, ఏ ఒక్క పాఠశాల కూడా మూతపడకూడదనే లక్ష్యంతో టీఎస్ యుటిఎఫ్ చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో పనిచేస్తోందని స్పష్టం చేశారు. కానీ, కొందరు ఉపాధ్యాయులు తాము జీతాలు తీసుకుంటున్న పాఠశాలల్లో కాకుండా, తమ సొంత ప్రయోజనాల కోసం అనుకూలమైన పాఠశాలలకు డిప్యూటేషన్ల కొరకు పైరవీలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే అక్రమ డిప్యూటేషన్లు ఎలా ఇస్తారు? ఇది విద్యార్థుల ప్రయోజనాల కోసం చేస్తున్న సర్దుబాటా లేక కొందరు ఉపాధ్యాయుల వ్యక్తిగత లబ్ధి కోసమా? జిల్లాలో ఇష్టారాజ్యంగా నడుస్తున్న ఈ వ్యవహారాన్ని యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

#### ---శాస్త్రీయ సర్దుబాటు.. పారదర్శక విధి నిర్వహణ...

మంగళవారం ఇద్దరు ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు చకచకా డెప్యుటేషన్ ఉత్తర్వులు జారీ చేసేశారు. ఎస్.జి.టి, యం.పి.పి.యస్. సుంక్షాల తండా, తిరుమలగిరి సాగర్ మండలం నుండి మునుగోడు మండలంలోని ఎంపీపీ ఎస్ మునుగోడు కు, స్కూల్ అసిస్టెంట్ హిందీ, జెడ్పిహెచ్ఎస్ ఉరుమడ్లను, చిట్యాల మండలం నుండి జెడ్ పి హెచ్ ఎస్ ఎల్లారెడ్డిగూడెం, నార్కట్పల్లి మండలనికి డిప్యూటేషన్ చేసారు. ఈ రెండు కీలక ఫైళ్లను ఈ నెల 8వ తేదీనే ఉన్నతాధికారుల ఆమోదానికి పంపగా, మరుసటి రోజు జూన్ 9న మెరుపు వేగంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఈ విషయాన్ని టిఎస్ యూటిఎఫ్ తీవ్రంగా పరిగణించింది.

జిల్లా విద్యాశాఖ అభాసుపాలు కాకుండా ఉండాలంటే తక్షణమే చర్యలు చేపట్టాలని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేసింది. నియమ నిబంధనలకు విరుద్ధంగా, కేవలం కొందరి స్వార్థం కోసం ఇచ్చిన అన్ని అక్రమ డిప్యూటేషన్లను తక్షణమే రద్దు చేయాలని, ఉపాధ్యాయులు తాము ఏ పాఠశాల నుండి వేతనం పొందుతున్నారో, నిబంధనల ప్రకారం అక్కడే విధులకు హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేయాలి. పాఠశాలల అవసరం, విద్యార్థుల సంఖ్య ఆధారంగా మాత్రమే మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టాలని టీఎస్ యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

#### --- ఊరుకునే ప్రసక్తే లేదు...

ఉపాధ్యాయుల వ్యక్తిగత ప్రయోజనాల కోసం విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని నాయకులు హెచ్చరించారు. కేవలం ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసమే డిప్యూటేషన్లు ఇస్తే, జిల్లా వ్యాప్తంగా టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉధృత ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశం ముగిసిన అనంతరం జిల్లా ఆఫీస్ బేరర్స్ బృందం నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ ని కలిసి, అక్రమ డిప్యూటేషన్లను నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. నాగమణి, ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు బి.అరుణ, నర్రా శేఖర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.అరుణ, జిల్లా కార్యదర్శులు, జిల్లా కమిటీ కన్వీనర్లు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 10:

జిల్లాలోని ప్రజల నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. బుధవారం జిల్లాలోని తాండూర్, నెన్నెల, మందమర్రి మండలాల తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించి అధికారులతో సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు మాట్లాడుతూ, ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకొని వచ్చి భూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా సాదా బైనమా దరఖాస్తులను స్వీకరించి విచారణ చేపట్టడం జరుగుతుందని, ఇట్టి దరఖాస్తులను నిర్ణీత గడుపులోగా పకడ్బందీగా విచారణ చేపట్టి పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# నల్గొండకు మహర్దశ

### ప్రతిరోజూ సురక్షిత తాగునీరు

### రూ. 83 కోట్ల నిధుల కేటాయింపు

### సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపిన మేయర్ చైతన్య

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

నల్లగొండ నగర ప్రజల దశాబ్దాల తాగునీటి గోసకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది. పట్టణంలో తాగునీటి సరఫరాను మెరుగుపరచడంతో పాటు, ప్రజలందరికీ ప్రతి రోజూ సురక్షితమైన మంచినీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక కృషితో నూతన నీటి శుద్ధి కేంద్రం మంచినీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ. 83 కోట్ల టియు ఎఫ్ఐడిసి నిధులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీవో నెంబర్ 597 ద్వారా పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను అతిత్వరలోనే పూర్తి చేసి, పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించనున్నారు.

#### పాలకవర్గం హర్షం -- సీఎం, మంత్రి వర్యులకు కృతజ్ఞతలు...

ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతమైన నల్లగొండ నగర ప్రజల మంచినీటి అవసరాలను గుర్తించి, ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం పట్ల నగర పాలక సంస్థ తీవ్ర హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీ అశ్రఫ్ అలీ, నగర పాలక సంస్థ పాలకవర్గ సభ్యులు ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు.నల్లగొండ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన సీఎం రేవంత్ రెడ్డి కి, నిధుల సాధనలో కీలక పాత్ర పోషించిన జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి నల్లగొండ నగర ప్రజల తరపున, మున్సిపల్ పాలకవర్గం తరపున వారు హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నిధులతో నల్లగొండ నగరం లో తాగునీటి సమస్య శాశ్వతంగా తీరనుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



# జిన్నారం రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు ;

**– జిల్లా వ్యవసాయ అధికారి సాక్రియా నాయక్ ;**



(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, జూన్,10)

జిన్నారం రైతు వేదికలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ సాక్రియా నాయక్ పాల్గొని రైతులను ఉద్దేశించి పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పంట అవశేషాల దహనం (స్టబుల్ బర్నింగ్) వల్ల నేల సారవంతత తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని వివరించి, రైతులు ఈ విధానాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. అలాగే ఎరువుల అక్రమ నిల్వలను నిరోధించాల్సిన అవసరాన్ని వివరించి, ఎరువుల నిఘా సమితులు (ఫెర్టిలైజర్ నిగ్రాని సమితిస్) ఎరువుల నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. "ఖేతీ బచావో అభియాన్" కార్యక్రమంలో భాగంగా సమతుల్య ఎరువుల వినియోగం ప్రాముఖ్యతను వివరించారు. అధిక మోతాదులో రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. అదేవిధంగా భూసారాన్ని మెరుగుపరచడానికి, సేంద్రియ పదార్థాల శాతాన్ని పెంచడానికి రైతులు పచ్చిరొట్ట ఎరువుల ( గ్రీన్ మన్యుర్) వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న వరి సన్న రకాల సాగును ప్రోత్సహించాలని, నానో యూరియా మరియు నానో డీఏపీ వినియోగం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి, సాగు వ్యయాలు తగ్గుతాయని వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మరికల్ మండలంలోని పలు ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు.

# సిద్దిపేట జిల్లా సివిల్ సప్లై అధికారిపై చర్యలు తీసుకుని, అక్రమాలకు పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులను రద్దు చేయాలి

**బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ డిమాండ్**

అక్షర కలం సిద్దిపేట జూన్ 10:



సిద్దిపేట పట్టణంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారని పలుమార్లు జిల్లా సివిల్ సప్లై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తూ ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ పేర్కొన్నారు. సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ కి లిఖితపూర్వక ఫిర్యాదు చేయడం జరిగింది. అక్రమంగా గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తున్న వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని సివిల్ సప్లై అధికారులకు అప్పగించినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత వ్యక్తులపై గానీ, గ్యాస్ ఏజెన్సీలపై గానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన జిల్లా సివిల్ సప్లై అధికారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే అక్రమాలకు పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా జరుగుతున్న గ్యాస్ అక్రమ వ్యాపారంపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ బడికే గ్రామం జై.. ప్రైవేట్ బస్సులకు నో!

గండీడ్, జూన్ 10. అక్షర కలం : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ బడిలోనే చేరేలా కృషి చేయాలని చిన్నవార్వాల్ గ్రామ ప్రజలు సంకల్పించారు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణదేవి, ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, కె. వెంకటయ్య గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులతో కలిసి సమావేశమై ప్రభుత్వ విద్య ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు స్పందిస్తూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో గ్రామం నుంచి ఒక్క విద్యార్థి కూడా ప్రైవేట్ పాఠశాలకు వెళ్లకుండా చూడటంతో పాటు, ప్రైవేట్ పాఠశాలల బస్సులను గ్రామంలోకి రానివ్వబోమని ప్రకటించారు. గ్రామంలోని పిల్లలందరికీ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే ప్రవేశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేసి ప్రభుత్వ బడిని ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణదేవి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్లకాడి చిన్న నర్సయ్య, గ్రామ పెద్దలు దాసరి రాములు, పవన్ కుమార్, నారాయణ గౌడ్, దస్తయ్య, వెంకటయ్య, శాంతయ్య, రవి, లింగాయపల్లి రాములు, కేశవులు, అంజి, రాజు, మైబు, గొడుగు రాములు, పూజా, శిరీష, అనిత, చెన్నమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సహకారంతోనే డ్రగ్స్ నిర్మూలన సాధ్యం: నర్వ ఎస్సై పబ్బతి రమేష్

**...మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసుల ఆకస్మిక తనిఖీలు**

**– జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు**





(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, జూన్,10)

నర్వ: నారాయణపేట జిల్లా, నర్వ మండల కేంద్రంలో మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని నర్వ ఎస్ఐ పబ్బతి రమేష్ తెలిపారు.

ఈ సందర్భంగా నర్వ మండల కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీంతో కలిసి ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలం "విక్కి" సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, ఎరువుల దుకాణాలు అనుమానాస్పద ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని తెలిపారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు సమాజాన్ని నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్, ఈగల్ ఫోర్స్ సిబ్బంది, నర్వ కానిస్టేబుల్ వంశీ పాల్గొన్నారు.

# గ్రామ సభలతో గ్రామాల అభివృద్ధి...

**– జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....**

మెదక్ /కొల్చారం జూన్10(అక్షరక లం):-





ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజుమాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌గ్రామ సభలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత , అవగాహన కార్యక్రమం నిర్వహించి పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులు లతో కలిసి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం పౌరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. పరిసరాల పరిశుభ్రత, అరైవ్ అలైవ్ ఈ అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సుకు జిల్లా కలక్టర్ ప్రతిమా సింగ్,అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్,ఎస్పీ శ్రీనివాస్ రావు హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. పౌరులతో కలసి ర్యాలీ నందు పాల్గొన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని గ్రామసభలతో ప్రజా సమస్యల పరిష్కారం పచ్చదనం, పారిశుధ్యంపై దృష్టి సారించాలి తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ పక్కాగా జరగాలని, బహిరంగ ప్రదేశాల్లో అస్సలు చెత్త వేయకూడదని, తగుల బెట్టకూడదన్నారు. పర్యావరణ పరిరక్షణ లో భాగం గా చెత్త విభజన, పరిసరాల పరిశుభ్రత మీద ప్రజలకి అధికారులు అవగాహన కల్పించాలన్నారు వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని పైపులైన్లకు మరమ్మత్తులు, నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. జిల్లా అభివృద్ధి, జిల్లా రక్షణ , పౌరుల రక్షణ ముఖ్యమైనది, పౌరుల భద్రత రక్షణలో పోలీసు శాఖ అనుక్షణం పని చేస్తుంది అని కలెక్టర్ తెలిపరూ. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు, గ్రామ సభలు నిర్వహిస్తున్నాం ప్రజలను చైతన్య పరుస్తున్నాం అన్నారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయసహకారాలు అందిస్తే రహవీర్ గా గుర్తింపు వస్తుంది అన్నారు, రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత అంటే రోడ్డు పై ప్రయాణం చేసేసమాజంలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడం. ప్రతి సంవత్సరంకాలంలో తెలంగాణ వ్యాప్తంగా 7500 కు పైగా ప్రాణాలు కోల్పోతున్నారు అన్నారు, మన జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే సంభవిస్తున్నాయి, తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, పిల్లలు వాహనాలు నడపడం, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి వీటిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు జాగ్రతగా అవగాహనలో వాహనాలు నడపాలి, రోడ్లపై ప్రయాణ సమాజంలో చైతన్యం మార్పు రావాలి అన్నారు. పోలీసు శాఖ అనుక్షణం అవగాహన కల్పిస్తూ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తున్నది అన్నారు. డ్రైవింగ్ చేయాలాంటే, అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఎక్కువ మంది హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోక పోవడం వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు అని గంకాలు చెప్తున్నాయి అన్నారు. విద్యాసంస్థలు ప్రారంభం అవుతున్నాయి విద్యార్థులను బస్సులు, ఇతర వాహనాలు కండిషన్ లేకుంటే సీజ్ చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు. పోలీసు కళాబృందం వారు పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి ,తూప్రాన్ ఆర్డీవో బావయ్య పాల్గొన్నారు.

# దేశ చరిత్రలో మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కొత్త దిశ నిర్దేశించింది....

**- మంత్రి పొన్నం ప్రభాకర్.....**

మెదక్/ కొల్చారం జూన్10( అక్షర కలం):-



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ. 199.08 కోట్ల పెట్టుబడితో 553 ౧+ూ=ుజ బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగానిలిచిందన్నారు. ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ. 69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ. 3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ. 20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగామారుతున్నారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కూడా ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. అదేవిధంగా మహాలక్ష్మి పథకం విజయవంతమైన అమలులో ఈ బస్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు 315 కోట్లకు పైగా మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు సుమారు రూ. 10,950 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకోగలిగారని పేర్కొన్నారు. మహిళలు ఆదా చేసుకున్న ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి మరియు చిన్న వ్యాపారాల కోసం వినియోగిస్తున్నారని మంత్రి వివరించారు. మహిళల చేతిలో మిగిలే ప్రతి రూపాయి కుటుంబ అభివృద్ధికి, సమాజ పురోగతికి దోహదపడుతుందని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని మహిళా సమాఖ్యలకు మొత్తం 61 బస్సులుకేటాయించబడినట్లు మంత్రి తెలిపారు. ఇందులో మెదక్ జిల్లాకు 20, సిద్దిపేట జిల్లాకు 23, సంగారెడ్డి జిల్లాకు 25 బస్సులుకేటాయించామని చెప్పారు. దీంతో ఆయా జిల్లాల్లో బస్సుల కొరత తగ్గి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందడంతో పాటు మహిళా సంఘాలు స్థిరమైన ఆదాయ వనరును పొందనున్నాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలను లబ్ధిదారుల నుంచి యజమానులుగా, భాగస్వాములుగా తీర్చిదిద్దడం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. మహిళా శక్తి పథకం ఆ దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే విప్లవాత్మక కార్యక్రమం అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955